ప్రజాశక్తి
శనివారం 15 మార్చి 2025 5
శ్రీకాకుళం



20న పోస్టల్ అదాలత్

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ పరిధిలోని పోస్టల్ వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించుకునేందుకు ఈనెల 20న పోస్టల్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ బి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం రెండు గంటలకు నగరంలోని రెల్లవీధిలో గల సూపరింటెండెంట్ కార్యాలయంలో అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోస్టల్ సేవలకు సంబంధించిన వ్యక్తిగత ఫిర్యాదులు ఇందులో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఫిర్యాదులను ఈనెల 20వ తేదీ లోగా తపాల అదాలత్, సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసు, శ్రీకాకుళం పోస్టల్ డివిజన్, శ్రీకాకుళం 532001 చిరునామాకు పంపించాలని సూచించారు. గడువు తేదీ తర్వాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవని, అటువంటి వారు నేరుగా ఫిర్యాదులతో కార్యాలయంలో హాజరు కావచ్చని సూచించారు.

పడకేసిన నారాయణపురం ఆనకట్ట



నారాయణపురం ఆనకట్టపై షట్లర్లు లేక వృథాగా పోతున్న నీరు (ఫైల్)

పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పారిశ్రామికవాడలు అంటూ గొప్పలు చెప్పే పాలకులు సాగునీటి ప్రాజెక్టుల పనులను పూర్తి చేయడంలో మాత్రం చిత్తశుద్ధి కనబరచడం లేదు. గత వైసిపి ప్రభుత్వం మూలపేట పోర్టును ఏర్పాటు చేస్తే అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ఎయిర్‌పోర్టు, పది వేల ఎకరాల్లో పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు సాగిస్తోంది. నిధుల్లేక నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలన్న శ్రద్ధ మాత్రం కనిపించడం లేదు. ఇందుకు బూర్జ మండలంలోని నారాయణపురం ఆనకట్ట నిదర్శనం. ఏడేళ్ల కిందట ప్రారంభించిన పనులు నేటికీ పూర్తి కాకపోవడం పాలకుల ఉదాసీనతకు అద్దం పడుతోంది.

- **బిల్లులు చెల్లించని ప్రభుత్వం**
- **అర్ధాంతరంగా ఆగిన పనులు**
- **బిల్లుల సమస్య లేకున్నా షట్టర్లను బిగించలేని ఉదాసీనం**
- **రైతులకు ఏటా తప్పని సాగునీటి వెతలు**



నారాయణపురం బంగ్లా వద్ద తుప్పల్లో షట్లర్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, బూర్జ

బూర్జ మండలం లాబాం పంచాయతీ నారాయణపురం, విజయనగరం జిల్లా సంతకవిటి మండలం రంగరాయపురం మధ్య నాగావళి నదిపై నిర్మించిన నారాయణపురం ఆనకట్ట ద్వారా మొత్తం 37,053 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలన్నది లక్ష్యంగా ఉంది. ఇందులో శ్రీకాకుళం జిల్లాలో 32,832 ఎకరాలు, విజయనగరం జిల్లాకు సంబంధించి 4,221 ఎకరాలు ఉన్నాయి. అప్పుడెప్పుడో 1960 దశకంలో నిర్మించిన ఆనకట్ట కాలక్రమేణా సామర్థ్యం బాగా తగ్గిపోయింది. కాలువలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో చాలాచోట్ల కాలువ ఆనవాళ్లు కోల్పోయాయి. జంగిల్ క్లియరెన్స్ లేక సాగునీరు ముందుకు వెళ్లని పరిస్థితి నెలకొంది. దీంతో శివారు భూములకు సాగునీరు అందడం గగనంగా మారిపోయింది. ఆనకట్టపై ఏర్పాటు చేసిన షట్టర్ల పరిస్థితి దయనీయంగా మారింది. అవి ఉన్నా, లేకున్నా ఒకటే అన్నట్లు షట్టర్ల పరిస్థితి ఉంది. నారాయణపురం ఆనకట్ట ఆధునికీకరణ చేపట్టాలని, కాలువలను బాగుచేయాలని రైతులు, రైతుసంఘాలు పలుమార్లు పాలకులు విన్నవించినా ఫలితం లేకపోయింది. చివరకు 2018-19లో నాటి టిడిపి ప్రభుత్వం నారాయణపురం ఆధునికీకరణ పనులను చేపట్టేందుకు సిద్ధమైంది. జపాన్ ఇంటర్నేషనల్ కోపరేషన్ ఏజెన్సీ (జైకా) నిధులతో పనులు చేపట్టేందుకు ముందుకొచ్చింది.

రూ.111.88 కోట్లు కేటాయింపు

నారాయణపురం ఆనకట్ట కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ పనుల కోసం 2019 ఫిబ్రవరిలో టిడిపి ప్రభుత్వ హయాంలో పనులకు శంకుస్థాపన చేశారు. జైకాకు చెందిన ముగ్గురు సభ్యుల బృందం 2019 మేలో ఆనకట్ట పరిసరాల్లో పర్యటించి, ప్రభుత్వం సమర్పించిన నివేదికను పరిశీలించి నిధులు ఇచ్చేందుకు అంగీకరించింది. నారాయణపురం హెడ్ వర్క్స్, ఎడమ కాలువ పనులను ప్యాకేజీ-ఎ కింద, కుడి కాలువ పనులను ప్యాకేజీ-బి కింద చేపట్టేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మొత్తం రూ.111.88 కోట్ల అంచనాతో పనులు చేపట్టాలని నిర్ణయించింది. షట్టర్లను ప్రత్యేక పనులుగా చేపట్టేందుకు మరో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. ప్యాకేజీ-ఎ పని విలువ రూ.62.46 కోట్లు కాగా, రూ.49.42 కోట్లకు ప్రభుత్వం అగ్రిమెంట్ చేసుకుని ఓ నిర్మాణ సంస్థకు అప్పగించింది. ప్యాకేజీ-బి పని విలువ రూ.49.64 కోట్లు కాగా, రూ.41.72 కోట్లకు అగ్రిమెంట్ చేసుకుని మరో నిర్మాణ సంస్థకు అప్పగించారు. షట్టర్ల పనులను రూ.1.94 కోట్లతో చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు.

పనుల పరిస్థితి దారుణం

నారాయణపురం ఆధునికీకరణ పనులు ఒప్పందం ప్రకారం 2021 మార్చి 31వ తేదీ నాటికి పూర్తి కావాల్సి ఉంది. ఆరేసి నెలలు చొప్పున ఒప్పంద కాలపరిమితిని పొడిగించుకుంటూ వచ్చారు. ఈనెల 31వ తేదీ నాటికి చివరిసారిగా పొడిగించిన ఒప్పంద కాలపరిమితి కూడా ముగియనుంది. పనుల పరిస్థితి చూస్తే మరీ దారుణంగా ఉంది. ప్యాకేజీ-ఎ పనులు 35 శాతం పూర్తి కాగా, ప్యాకేజీ-బి పనులు 45 శాతం పూర్తయ్యాయి. పనులు అర్ధాంతరంగా ఆగిపోవడానికి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడమే ప్రధాన కారణమని తెలుస్తోంది. ప్యాకేజీ పనులకు రూ.12 కోట్లు, ప్యాకేజీ-ఎ పనులకు రూ.మూడు కోట్ల మేర ప్రభుత్వం బకాయి పడినట్లు తెలుస్తోంది.

షట్టర్ల ఏర్పాటుకు అడ్డంకులేమిటో?

నారాయణపురం ఆనకట్టపై షట్టర్ల ఏర్పాటు పనులను మూడు కేటగిరీలుగా విభజించి అధికారులు పనులు మొదలుపెట్టారు. ఆనకట్ట సిస్టమ్‌కు ఫాలింగ్ ఏర్పాటు, షట్టర్ల పున: నిర్మాణం, ఎడమ కాలువ రెగ్యులేటర్ షట్టర్లు పున:నిర్మాణం చేపట్టేలా మూడు ఏజెన్సీలకు పనులు అప్పగించారు. పనులకు బిల్లుల చెల్లింపు వంటి సమస్యలు లేకున్నా, వాటినీ ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదు. దీంతో నారాయణపురం బంగ్లా వద్ద ఉన్న షట్టర్లు తుప్పు పట్టిపోతున్నాయి.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

నారాయణపురం ఆధునికీకరణ పనుల్లో ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడినట్లు కనిపిస్తోంది. పనులపై సమీక్ష చేసినా దాఖలాలు పెద్దగా కనిపించడం లేదు. ప్రజాప్రతినిధులదీ అదే పరిస్థితిగా ఉంది. ఎత్తిపోతల పథకాలపై ఉన్న శ్రద్ధ నారాయణపురం ఆధునికీకరణ పనులపై పాలకులు శ్రద్ధ చూపలేదన్న విమర్శలూ లేకపోలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే కూన రవికుమార్ రైతులకు మేలు చేసే సాగునీటి ప్రాజెక్టులను వదిలేసి థర్మల్ పవర్‌ప్లాంట్ జపం చేయడంపై రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



నారాయణపురం ఆధునికీకరణ ప్యాకేజీ పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో రెండేళ్లుగా పనులు ఆగిపోయాయి. పనుల ఒప్పంద కాలపరిమితి కూడా ఈనెల 31వ తేదీతో ముగియనుంది. పనుల పరిస్థితి, బకాయిల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. షట్టర్ల ఏర్పాటుకు ఎటువంటి సమస్య లేదు. వాటిని వెంటనే బిగించేలా చూస్తాం.

- పి.సుధాకరరరావు, నీటిపారుదల శాఖ ఇఇ



నిరసన తెలుపుతున్న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక నాయకులు

విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి

- **సొంత గనులు కేటాయించాలి**
- **సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు**
- **స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన**

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడంతో పాటు సొంత గనులు కేటాయించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక ఆధ్వర్యాన శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు నాలుగేళ్లుగా కార్మికులు, ఉద్యోగులు పెద్దఎత్తున ఆందోళనలు చేస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా మోసపూరిత ప్రకటనలు చేస్తున్నాయన్నారు. నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికుల జీతాలు నిలుపుదల చేశారని, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ నిధులతో తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ మాటనే మరిచిందని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ నిధులు కేవలం అప్పులకే ఖర్చు చేయాలని ప్రకటించడం దుర్మార్గమన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు.

ప్రైవేటీకరణ విధానాలను, అక్రమ తొలగింపులను ప్రశ్నిస్తున్న కార్మిక నేతలకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. 32 మంది ఆత్మబలిదానాలు, ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌పై సరైన నిర్ణయం తీసుకోకపోతే తర్వాత సంభవించే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

నిరసనకు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం జరిగే పోరాటానికి సిపిఎం అండగా ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు పరిశ్రమకు అండగా ఉంటారో, కార్పొరేట్ల పక్షాన ఉంటారో తేల్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.కళ్యాణి, డి.సుదర్శనం, కోశాధికారి హైమ, జెవివి నాయకులు కె.అప్పారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పవిత్ర, హరీష్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సంతోష్, కె.శ్రీనివాస్, సిపిఐ నాయకులు ఆర్.రమేష్, స్మార్ట్‌కమ్, శ్యామ్‌పిస్టన్స్, ఎన్ఎసిఎల్, మెడికల్ రిప్స్, ఆశా, మిడ్డే మీల్స్, తదితర సంఘాల నాయకులు పి.దుర్గాప్రసాద్, ఎ.సత్యనారాయణ, రవికుమార్, బి.వాసుదేవరావు, పి.జగ్గారావు, జనార్ధనరావు, ప్రవీణ, ఢిల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రంగుల హోలీ... ఆనందాల కేళీ

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

రంగుల హోలీ పండుగను జిల్లాలోని పలుచోట్ల ఆనందోత్సాహాలతో శుక్రవారం చేసుకున్నారు. కవిటి మండలంలో హోలీ వేడుకల చిరుజల్లుల్లో యువకులు, చిన్నారులు తడిసి ముద్దయ్యారు. ఒకరికొకరు రంగులు పూసుకుని కేరింతలు కొట్టారు. ఇచ్ఛాపురంలో జెసిఐ సంస్థ ఆధ్వర్యాన స్వేచ్ఛానగర్ వద్ద హోలీ వేడుకలను నిర్వహించారు. పలురకాల ఆటలు, సంగీత ప్రదర్శనలు, నృత్యాలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. రణస్థలంలో డప్పు వాయిద్యాల నడుమ రంగులు చల్లుకుంటూ వేడుకలు చేసుకున్నారు.



విధి నిర్వహణలో నిబద్ధతగా పనిచేయాలి

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



ఫీల్డ్ అసిస్టెంట్లకు నియామక పత్రాలు అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

విధి నిర్వహణలో నిబద్ధతగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక ఎన్‌టిఆర్ భవన్‌లో కోటబొమ్మాళి మండలానికి చెందిన పది పంచాయతీలకు నూతనంగా నియమితులైన ఫీల్డ్ అసిస్టెంట్లకు నియామక పత్రాలను శుక్రవారం అందజేశారు. అనంతరం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతులు పరిశీలించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన ప్రజలకు మేలు చేసేవిధంగా సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం లేకుండా అధికారులు పనిచేయాలని సూచించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, మెరుగుదలే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రీతిలో మౌలిక వసతుల కల్పనకు కట్టుబడి ఉన్నామన్నారు. సాగు, తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రధానంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని వినతులు వచ్చాయి. నూతన ఫించన్లు, గృహాలు మంజూరు చేయాలని ప్రజల నుంచి పెద్దఎత్తున వినతులు అందాయి. అర్హత ఉన్న వారికి నూతన ఫించన్ మంజూరు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, బగాది శేషు, నాలుగు మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేస్తాం

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు

స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని కింతలిలో డ్వాక్రా మహిళలకు పిఎంఇజిపి ద్వారా అందజేసిన ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్ డిజైన్స్ యూనిట్లను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఇంటి వద్ద ఉంటూనే ప్రభుత్వం కల్పిస్తున్న స్వయం ఉపాధి పథకాల ద్వారా అందజేస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడమే కాకుండా మరికొంత మందికి ఉపాధి అవకాశాలను కల్పించవచ్చని చెప్పారు. పిఎంఇజిపిలో భాగంగా 35శాతం సబ్సిడీతో యూనిట్ రూ.ఎనిమిది లక్షలు చొప్పున మూడు యూనిట్లకు రూ.24 లక్షలు కెనరా బ్యాంకు ద్వారా రుణాన్ని మంజూరు చేసినట్లు డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావు, ఎంపిడిఒ మీసాల మన్మథరావు, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, ఎంఎంఎస్ అధ్యక్షులు అరుణ, ఎసి రవికుమార్, ఎపిఎం రాంమూర్తి, ఎపిఒ శ్రీనివాసరావు, టిడిపి నాయకులు కూన వెంకట సత్యనారాయణ, అన్నెపు రాము తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహావిష్కరణ

పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని రవికుమార్ ఆవిష్కరించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు పి.కూర్మారావు, వై.గోపాలరావు, వై.రమాదేవి ఈ విగ్రహాన్ని పాఠశాలలో ఏర్పాటు చేశారు. వారిని ఎమ్మెల్యే అభినందించి దుశ్శాలువతో సత్కరించారు. వ్యక్తిగత కక్షతో కొంతమంది ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్ ప్రయోజనాలను నిలిపివేయడంపై ఎమ్మెల్యేకు వచ్చిన ఫిర్యాదుపై హెచ్ఎం వెంకటరావును మందలించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేగడి లక్ష్మి, ఇఒ మోహన్‌బాబు, టిడిపి నాయకులు బాడాన శేషగిరి, ఎ.విజయలక్ష్మి, బలగ శంకరభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



మగ్గం వర్క్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్



చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న భారతీ సౌజన్య


చెత్త సంపద కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

సంతబొమ్మాళి, కోటపాడు పంచాయతీల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య శుక్రవారం పరిశీలించారు. తడి, పొడి చెత్త వేరు చేయడం, వర్మీ కంపోస్టు తయారీని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సంతబొమ్మాళి గ్రామంలోని సాలి వీధిలోని కొన్ని ఇళ్లకు వెళ్లి ప్రతిరోజూ ఇంటింటా తడి, పొడి చెత్త సేకరిస్తున్నారా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పిఆర్ అండ్ ఆర్‌డి పద్మజ, సంతబొమ్మాళి పంచాయతీ సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి అప్పారావు, పంచాయతీ కార్యదర్శి దుంపల శ్రీనివాసరావు, క్లాప్‌మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దును విరమించుకోవాలి

ప్రజాశక్తి - ఆమదాలవలస



సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

ఆప్కాస్ రద్దును ప్రభుత్వం విరమించుకోవాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐ.జె నాయుడు కాలనీలో మున్సిపల్ కార్మికుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేసి, ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలని ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. 17 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వ ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ సిఫార్సులను ఆర్థిక శాఖ ఆమోదించకుండా కూటమి ప్రభుత్వం వెనక్కి పంపడం దుర్మార్గమన్నారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని, ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వం కొలువుదీరి ఎనిమిది నెలలైనా హామీని నెరవేర్చలేదని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు. విధుల్లో పనిచేస్తూ చనిపోయిన, గాయపడిన కార్మికుల స్థానంలో వాళ్ల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ కార్మికులకు రెండో శనివారంతో పాటు జాతీయ సెలవులు పూర్తిస్థాయిలో అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికులకు జాతీయ సెలవులు వర్తింపజేయాలని కోరారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఫెడరేషన్ నాయకులు తాడి సంతోష్ కుమార్, కె.తారక్, కె.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ జాతీయ ఉపాధ్యక్షులు రమాదేవి

ప్రభుత్వరంగ సంస్థల నిర్వీర్యానికి కుట్ర

బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జాతీయ ఉపాధ్యక్షులు కె.రమాదేవి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వరంగ సంస్థల నిర్వీర్యానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జాతీయ ఉపాధ్యక్షులు కె.రమాదేవి విమర్శించారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలోని వి.జి.కె మూర్తి సభా ప్రాంగణంలో బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా 10వ మహాసభలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేషనల్ మోనటైజేషన్ పైపులైన్ పేరుతో ప్రభుత్వరంగ సంస్థల ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెడుతోందని విమర్శించారు. అందులో భాగంగానే బిఎస్ఎన్ఎల్ సంస్థ ఆస్తులను అదానీ, అంబానీలకు కట్టబెట్టిందన్నారు. బిఎస్ఎన్ఎల్ తన సేవలను విస్తరించడానికి, సాంకేతిక శక్తిసామర్థ్యాలను పెంచుకోవడానికి ప్రయత్నించిన ప్రతిసారీ అడ్డంకులు కల్పించిందని గుర్తుచేశారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా 3జి, 4జి, 5జి సేవల్లోకి వెళ్తామన్న ప్రతిసారీ అనుమతి నిరాకరించిందని తెలిపారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సాగర్, కృష్ణబాలాజీ మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్‌పై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న కేంద్ర ప్రభుత్వం, ప్రయివేటు టెలికాం కంపెనీలపై ప్రేమ కనబరుస్తోందన్నారు. బిఎస్ఎన్ఎల్ బలంగా ఉన్నప్పుడు ప్రయివేటు ప్రొవైడర్ల ధరలు అదుపులో ఉండేవని గుర్తుచేశారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు రావాల్సిన పిఆర్‌సి, డిఎలు, అలవెన్సులు పదేళ్లుగా చెల్లించకుండా సంస్థ నష్టాలను బూచిగా చూపిస్తున్నారన్నారు.

'బిఎస్ఎన్ఎల్ మనుగడ-ఉద్యోగుల కర్తవ్యాలు' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో సిఐటియు సీనియర్ నాయకులు కె.శ్రీనివాసు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎల్ఐసి, రైల్వే, విమానయానం తదితర సంస్థలను ప్రైవేటీకరించిందన్నారు. దశల వారీగా వాటాలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని విమర్శించారు. బిఎస్ఎన్ఎల్ మనుగడకు పోరాటాలు అనివార్యమన్నారు. బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజరు మద్రినాయుడు మాట్లాడుతూ సంస్థ మనుగడకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 4జి సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. సెమినార్ అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎనుకున్నారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం.గోవర్ధనరావు, పి.వెంకటరావు, కోశాధికారిగా కరుణశ్రీతో పాటు 18 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

పాతపట్నం : మధ్యాహ్న భోజన పథకానికి ధరలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలని తదితర సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 18న విజయవాడలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి పిలుపునిచ్చారు. సంఘ మండల కార్యదర్శి టి.సీతమ్మ అధ్యక్షతన మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సంఘ మండల కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వంట కార్మికులకు రూ.మూడు వేలు గౌరవ వేతనం ఇస్తూ వెట్టి చాకిరీ చేయించుకుంటోందని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి వంట కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు ఎన్.గీతాబాల, కుమారి, దుర్గమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.


బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి- పోలాకి

వనిత మండలం గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనులు వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే పర్యటనలో భాగంగా నరసన్నపేట నియోజకవర్గం, పోలాకి మండలంలో నిర్మాణంలో ఉన్న వనిత మండలం బ్రిడ్జి నేటివరకు జరిగిన పనులను రోడ్లు భవనాల శాఖ రాష్ట్ర ఇంజనీర్ ఇన్ ఛీఫ్ నయీముల్లా, జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్‌లతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులు నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని, నాణ్యతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి- పలాస

కష్టాలలో ఉన్న ప్రజలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం నిబద్ధతకు నిదర్శనమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని ఐదుగురికి రూ.9 లక్షల 72 వేల సిఎం సహాయ నిధి చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ మెరుగైన వైద్య అవసరాలకు పేదరికం అడ్డు కాకూడదన్న ఆశయంతో సిఎం చంద్రబాబు సహాయ నిధి ద్వారా వేలాది కుటుంబాలను ఆదుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, టంకాల రవిశంకర్ గుప్తా, మల్లా శ్రీనివాసరావు, కుత్తుం లక్ష్మణ్ కుమార్, ఎం.నరేంద్ర, చిన్ని పాల్గొన్నారు.


ప్రశంసాపత్రం అందుకుంటున్న షణ్ముఖరావు

ఉద్దానం విద్యార్థి ఉత్తమ ప్రతిభ

ప్రజాశక్తి- మందస

దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ (ఐఎంఒ) ఢిల్లీలో నిర్వహించిన ప్రతిభా పరీక్షలో శ్రీకాకుళం జిల్లా మందస మండలం, నాతుపురం బొడ్లూరుకు చెందిన విద్యార్థి షణ్ముఖరావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు సాధించాడు. రాష్ట్ర రాజధాని అమరావతిలో షణ్ముఖరావు నిర్వాహకుల నుంచి ప్రశంసా పత్రం, మెడల్ అందుకొని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచాడని ఉపాధ్యాయులు దాసరి ఈశ్వరరావు తెలిపారు. నాతుపురం బొడ్లూరు పాఠశాలలో షణ్ముఖరావు 1 నుంచి 4 వరకు చదివాడని, నాలుగవ తరగతిలో ఎపిఆర్ఎస్ ప్రవేశ పరీక్షలో గుంటూరు జిల్లా తాడికొండ గురుకులంలో సీటు సాధించి పదవ తరగతి చదువుతున్నాడని తెలిపారు. శ్రీచైతన్య, నారాయణ, భాష్యం వంటి కార్పోరేట్ పాఠశాలల విద్యార్థులతో పోటీపడి సాధించిన ఈ విజయంపై ఉపాధ్యాయులు ఈశ్వరరావు, తల్లిదండ్రులు బొడ్డు జీవనరావు, మోహిని, ఉద్దాన ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.


మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న నీటిపారుదల శాఖ ఉద్యోగులు

మంత్రికి ఉద్యోగుల కృతజ్ఞతలు

కోటబొమ్మాళి: నీరు -చెట్టు పనుల్లో అవకతవకలు జరిగాయని నీటిపారుదల శాఖలో వివిధ స్థాయిల ఉద్యోగులపై గత వైసిపి ప్రభుత్వంలో పెట్టిన విజిలెన్స్ కేసులను ఎత్తివేసేందుకు కృషి చేసిన రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ శాఖ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి నాయకులు చేపట్టిన నీరు- చెట్టు పనుల నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపణలతో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ స్థాయిలో 386 మందికి, జిల్లాలో 26 మందిపై కేసులు పెట్టారని, ఐదేళ్లుగా ఇబ్బందులు పడ్డామని, టిడిపి అధికారంలోకి వచ్చాక తమపై పెట్టిన కేసులన్నీ ఎత్తివేడంతో ఉద్యోగులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఉద్యోగులు లోకేష్, శ్రీనివాసరావు తదిరులు పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయాలి

టెక్కలి రూరల్: స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీ టెక్కలి మేజర్ పంచాయతీ నుంచి ప్రారంభించనున్నట్టు ఎంపిడిఒ చింతా లక్ష్మీబాయి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటలకు టెక్కలి పంచాయతీ కార్యాలయం దగ్గరకు ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు హాజరుకావాలని కోరారు.

సేవా మార్గంలో నడవాలి

వజ్రపుకొత్తూరు: ప్రతి మనిషి సేవా మార్గంలో నడవాలని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు అర్. లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం గోవిందపురం సత్యసాయి మందిరంలో కన్వీనర్ జగ్గు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా సదస్సులో ఆయన పాల్గొన్నారు. మానవ సేవే మాధవ సేవగా భావిస్తూ సత్యసాయి సేవా సంస్థలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. మహిళలు నైతిక విలువలు, సత్ప్రవర్తన కలిగి కుటుంబాన్ని, సమాజాన్ని వృద్ధిలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సత్యసాయి రాష్ట్ర సేవాదళ్ కన్వీనర్ నాగేశ్వరావు, జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త అరుణ, అన్నపూర్ణమ్మ, కమల త్రివేది, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు పాలిన శ్రావణి, పాలిన శ్రీనివాసరావు, కొంచాడ నూకరాజు, కొంచాడ వెంకటరావు, కొంచాడ గోవిందరావు, సుకన్య, విజయలక్ష్మి, నాగమణి, దేవి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లక్ష్మణరావు

పేదింట పెద్ద కష్టం

- దయనీయ స్థితిలో డయాలసిస్ రోగి
- ఆపన్నహస్తాల కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి- కవిటి

మండలం సహలాలపుట్టుగ గ్రామానికి చెందిన పొట్టి దుర్యోధన వారానికి మూడు డయాలసిస్‌లు చేయించుకోవాల్సిన పరిస్థితిలో ఆర్థిక సమస్యల కారణంగా కేవలం ఒకే డయాలసిస్ చేయించుకుంటూ నెట్టుకొస్తున్నాడు. భార్య జమున, ఇద్దరు కుమార్తెలతో ప్రస్తుతం తన కుటుంబం దయనీయ స్థితిలో గడుస్తోందని తెలిపాడు. డయాలసిస్ పింఛను కూడా మంజూరు కాకపోవడంతో ప్రస్తుతం తమ పరిస్థితి దుర్భరంగా మారిందని, సమయానికి డబ్బులు సర్దుబాటు కాకపోవడంతో రోజురోజుకూ తన ఆరోగ్యం క్షీణిస్తోందని దుర్యోధన కన్నీటి పర్యంతమయ్యాడు. తనపై ఆధారపడిన కుటుంబం ప్రస్తుతం దిక్కులేనిదైందని, ఏం చేయాలో తెలియని స్థితిలో తన బిడ్డలు ఆందోళన చెందుతున్నారని వాపోయాడు. స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి తమకు దారి చూపించాలని రెండు చేతులు జోడిస్తూ వేడు కుంటున్నాడు.

వివరాల్లోకి వెళ్తే కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని సాకుతున్న పొట్టి దుర్యోధన కిడ్నీ వ్యాధికి గురయ్యాడు. వారానికి మూడు డయాలసిస్‌లు చేయకపోతే ప్రాణానికే ప్రమాదమని వైద్యులు తేల్చి చెప్పారు. అయితే సోంపేట డయాలసిస్ సెంటర్‌లో బెడ్లు ఖాళీ లేకపోవడంతో పలాసలో ఒకసారికి రూ.3వేలు చెల్లించి డయాలసిస్ చేయించుకుంటున్నాడు. తెలిసిన వారి దగ్గర డబ్బులు అప్పు చేసి ఆ ఒక్కసారి కూడా డయాలసిస్ చేయిస్తున్నానని అంతకుమించి తనకు స్తోమత లేదని దుర్యోధన విలపిస్తున్నాడు. తమకు నా అనేవారు ఎవరూ లేరని, కనీసం సోంపేట డయాలసిస్ సెంటర్‌లో తనకు అవకాశం ఇస్తే ఎంతో మేలు జరుగుతుందని వాపోతున్నాడు. గతేడాది టిబి రోగానికి గురై ఆరు మాసాలు ఇంటి వద్ద ఉన్నానని, ఇప్పుడు మూడు నెలల నుంచి కిడ్నీ వ్యాధితో మంచం పట్టినట్టు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ తెలిపాడు. ఇద్దరు ఆడపిల్లలతో తమ పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి తనకు సోంపేటలో డయాలసిస్ జరిగేలా సహకరించాలని వేడుకుంటున్నాడు. మరోవైపు రోజురోజుకూ తన ఆరోగ్యం క్షీణిస్తోందని, దిక్కులేని తన కుటుంబం జీవించేందుకు దాతలు అండగా నిలిచి ఆర్థికసాయం అందించాలని ప్రార్థిస్తున్నాడు. స్పందించే హృదయాలు ఎస్.బి.ఐ అకౌంట్ నెంబరు 38599437774, ఐ.ఎఫ్.ఎస్.సి కోడ్ SBIN 0008820 కు గానీ ఫోన్ పే నెంబరు 8465896439కు గానీ ఆర్థికసాయం అందించాలని చేతులు జోడిస్తూ అర్థిస్తున్నాడు.


వేడుకుంటున్న దుర్యోధన (ఇన్‌సెట్‌లో) చికిత్స పొందుతున్న దుర్యోధన

నేటి నుంచి ఒంటి పూట బడులు

టెక్కలి: రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆదీనంలో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రయివేట్, ఎయిడెడ్ పాఠశాలలకు శనివారం నుంచి ఒంటి పూట బడులను ప్రభుత్వం ప్రకటించింది. విద్యాశాఖ అకడమిక్ కేలండర్ ప్రకారం శనివారం నుంచి ఒంటి పూట బడులకు సంబంధించిన కాల నిర్ణయపట్టికను విడుదల చేశారు. ఉదయం 7-45 నుంచి మధ్యాహ్నం పన్నెండున్నర వరకు పాఠశాల పనిచేసే విధంగా రూపొందించారు. మధ్యాహ్నం భోజనం అనంతరం విద్యార్థులను ఇళ్లకు విడిచి పెట్టనున్నారు. పదో తరగతి పరీక్షలు జరగనున్న కేంద్రాల్లో ఉదయం పూట బడులను మధ్యాహ్నం నాటికి మార్చారు.

'హాల్ టికెట్లకు యాజమాన్యాల ఇబ్బందులు'

ప్రజాశక్తి- పోలాకి

ఈనెల 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న 10వ తరగతి పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్లను పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయని విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిగిలిపల్లి మదన్ కుమార్ మండిపడ్డారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ హాల్ టికెట్‌లో సంతకాలు, స్టాంపులు ఉండాలని నిబంధనలు పెట్టి విద్యార్థులకు మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన అన్నారు. ఈ సమయంలో ఫీజుల కోసం విద్యార్థులకు ఒత్తిడి పెంచడం సమంజసం కాదని, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే పలు సూచనలు చేసిందని గుర్తు చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు జారీ ప్రక్రియ మొదలుపెట్టిందన్నారు. ఎవరైనా విద్యార్థులకు హాల్ టికెట్ల కోసం ఇబ్బంది పెడితే వారిని విడిచి పెట్టమని హెచ్చరించారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని అప్‌హోల్డ్ సంస్థ ఆధ్వర్యాన ఎచ్చెర్ల మండలం కొంగరాంలో మూడు రోజుల పాటు బాల్య వివాహాలు, బాలల అక్రమరవాణా, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మూడు రోజుల పాటు కొనసాగిన ఈకార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. మన్యం, శ్రీకాకుళం, అనకాపల్లి, విశాఖ నగరానికి చెందిన 120 మంది హాజరయ్యారు. సంస్థ ఛైర్మన్ అంజరి ఫిలిప్ ఆమోతి, రిసోర్స్ పర్సన్స్‌గా డేవిడ్ రాజు, చంద్రశేఖర్ వ్యవహరించారు. బాల్యవివాహాల నిషేధ చట్టం 2006, బాల కార్మిక చట్టం, పోక్స్ చట్టంపై అవగహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు.


బ్యాంకింగ్ సేవలు మెరుగుపర్చాలి

గుజరాతీపేట: జిల్లాలో ప్రభుత్వ బ్యాంకులకు సంబంధించి గ్రామీణ ప్రాంతాలకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ చేయాలని, ప్రతిఒక్క గ్రామంలో బ్యాంకింగ్ మిత్రుల నియామకం జరుగుతుందని మ్యాగ్నెట్ కన్సల్టెన్సీ జిల్లా కో-ఆర్డినేటర్ బి.అనంతకుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్‌లకు సంబంధించి జిల్లాలో ఎక్కడెక్కడ బ్యాంకులు ఉన్నాయో ఆ పరిసర గ్రామాల్లో నివసిస్తున్న నిరుద్యోగులకు, అదేవిధంగా డ్వాక్రా మహిళలకు, డిఆర్‌డిఎ సిఎఫ్‌లకు, జిరాక్స్ షాపు యజమానులు, మీసేవ సెంటర్లుకు ఈ అవకాశం కల్పిస్తున్నట్టు వివరించారు. పదవ తరగతి పాసై ఎటువంటి పోలీసు కేసులు లేకుండా ఉన్నవారు అర్హులని, వీరు ఆ బ్యాంకుకు సంబంధించి మినీ బ్యాంకు టైపు బ్యాంకుకు అనుసంధాన కర్తలుగా పని చేస్తారన్నారు. వీరు పనిచేసే పనిబట్టి కమిషన్ ఉంటుందని, ఆసక్తి గలవారు జిల్లా కో-ఆర్డినేటర్ బి.అనంత కుమార్ ఫోన్ నంబర్ 9493289488ను సంప్రదించాలని కోరారు.


రహదారులకు శంకుస్థాపన చేస్తున్న వెంకట సత్యనారాయణ

రోడ్లు, కాలువల నిర్మాణం

పొందూరు: దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని తోలాపి గ్రామానికి ఎమ్మెల్యే కూన రవికుమార్ చొరవతో మహర్దశ పట్టింది. గ్రామంలో మొదటి విడతలో రూ.1.54 కోట్లుతో 24 రహదారులు, కాలువలను మంజూరు చేశారు. ఈ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే సోదరుడు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కూన వెంకట సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.అమ్మాయమ్మ, ఎంపిడిఒ మీసాల మన్మధరావు, ఉపసర్పంచ్ శ్రీనివాస రావు, మాజీ ఎంపిటిసిలు పి.అప్పారావు, పి.అప్పల నాయుడు, డి.సత్యం, గంగాధరరావు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

నిస్సహాయులకు అన్నదానం

శ్రీకాకుళం అర్బన్: అన్నవితరణ సేవ ఒక వరమని, జానకి గ్లోబల్ ఫౌండేషన్ ఫౌండర్ పుక్కల ఉమా, మోహన్ దంపతులు అన్నారు. శుక్రవారం నగరంలోని ఏడురోడ్ల కూడలి వద్ద నిస్సహాయులకు, పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నారులు భావన, కౌశిక్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు బి.చిన్మయరావు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహ అభివృద్ధికి రూ.9 లక్షలు

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట బిసి హాస్టల్ అభివృద్ధికి రూ.9 లక్షలు మంజూరు చేయడం జరిగిందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక దేశవానిపేట వద్ద ఉన్న బాలికల వసతి గృహంలో మౌలిక వసతులు కల్పించేందుకు రూ.9 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం సంబంధిత పనులను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంలో సాధ్యమన్నారు. ముఖ్యంగా విద్యార్థినిలు చదువుపై దృష్టి సారించాలంటే వారికి మౌలిక సదుపాయాలు అందజేయాలని ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యార్థినుల మరుగుదొడ్లు, స్నానపు గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి రావడంతో ఈ నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు.


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

కార్యక్రమంలో నియోజవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో అద్భుత ఫలితాలు


నాటికను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

అద్భుత ఫలితాలు సాధించగలమనే ఆత్మవిశ్వాసం విద్యార్థులకు అవసరమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బోరుభద్ర ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ అన్నారు. పాఠశాల వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకమని, సాధించాలనే కృషి తోడైతే అత్యున్నత స్థాయికి ఎదగవచ్చునన్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయబోయే విద్యార్థులకు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తూ పరీక్షా సామగ్రిని హెచ్ఎం, ఉపాధ్యాయుల చేతులమీదుగా పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు ఉల్లాసం నింపే నృత్య ప్రదర్శనలు, ఆలోచింపజేసే నాటికలు ప్రదర్శించారు. కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాడాన రాజు, ఉపాధ్యాయులు టి.లోకేశ్వరరావు, డి.ఉమా శంకర్, వెంకట రెడ్డి, కె.త్రినాధరావు, డి.ఉమాదేవి, కె.రమణమ్మ, టి.విజయలక్ష్మి, బి.నాగమణి, కె.తవిటి రెడ్డి, బి.రజని తదితరులు పాల్గొన్నారు.

గురువులను గౌరవించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి విద్యార్థి తల్లి దండ్రులతో సమానంగా గురువులను ఎల్లప్పుడు గౌరవించాలని, అప్పుడే ఉన్నత స్థితికి చేరుకోగలరని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ పి.రాజశేఖర్ అన్నారు. శుక్రవారం నగరంలోని పిఎన్ కాలనీలో ఉన్న సాయి విద్యా మందిర్ ఫేర్ వెల్ వేడుకల్లో ఆయన పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే విద్యతో పాటు ఉన్నతమైన విలువలను అలవర్చుకోవాలన్నారు. ఎల్లప్పుడు విద్యార్థుల మంచిని కోరే గురువులను ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా తమ పాఠశాలలో విద్యతో పాటు ఉన్నతమైన విలువలను అందిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు అతిథులు చేతుల మీదుగా అట్టలు, పెన్నులు, హాల్ టికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అద్యంతం అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ సీపాన లక్ష్మి, సీనియర్ ఉపాధ్యాయులు పైడి పాండురంగారావు, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, మేనేజర్ పిఎస్ఎం లక్ష్మి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


రాజశేఖర్‌ను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

పిఠాపురానికి జన సైనికులు


మెళియాపుట్టి : బయలుదేరిన జనసేన అభిమానులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

జనసేన పార్టీ 12 ఆవిర్భావ దినోత్సవానికి మెళియాపుట్టి మండలం నుంచి జనసైనికులు పిఠాపురానికి పెద్దఎత్తున కదిలారు. శుక్రవారం జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అధ్యక్షతన జరుగుతున్న భారీ బహిరంగ సభకు మండలం నుంచి జనసేన నాయకులు, వీర మహిళలు, అభిమానులు తరలివెళ్లారు. మండల జనసేన నాయకులు దుక్క బాలరాజు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో పిట్ట హరికృష్ణ, సోలాపురం చంటి, లక్ష్మీపురం కిరణ్, ప్రశాంత్, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట: పిఠాపురంలో జనసేన 12వ ఆవిర్భావోత్సవ కార్యక్రమానికి నరసన్నపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బలగ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నాలుగు మండలాల కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు.

టెక్కలి: జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పిఠాపురం జనసేన సమావేశానికి టెక్కలి నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు, జనసేన పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో రెండు బస్సుల ద్వారా కార్యకర్తలు తరలివెళ్లారు.

ఘనంగా ఆక్షి 2కె25

ప్రజాశక్తి- గుజరాతీపేట

కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల కంప్యూటర్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆక్షి 2కె25 ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ డీన్ డా.యు.డి.ప్రసన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీయడంలో ఇలాంటి ఫెస్టివల్స్ ఎంతో ఉపయోగకరమన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, డేటా సైన్స్ వంటి ఆధునిక సాంకేతిక కోర్సులపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. ఫెస్ట్‌లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేసి, విద్యార్థుల ప్రాజెక్టులను ఆయన పరిశీలించారు. కళాశాల డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ మాట్లాడుతూ కంప్యూటర్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విద్యార్థులు కొత్త సాంకేతికతలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, కంప్యూటర్ విభాగాధిపతి ఎల్.ప్రసాదరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఫెస్ట్‌ను పరిశీలిస్తున్న యాజమాన్య ప్రతినిధులు

రచ్చకెక్కిన వైశ్య సంఘం ఎన్నిక

టెక్కలి: నియోజకవర్గ కేంద్రమైన టెక్కలి పట్టణంలోఉన్న ఆర్య వైశ్య సంఘ వివాదం మరలా రచ్చకెక్కింది. స్థానిక ఆర్య వైశ్య కళింగ కోమటి సంఘం భవనం వద్ద గురువారం రాత్రి ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. గత వైసిపి ప్రభుత్వ హయాంలో సంఘ అధ్యక్షునిగా ప్రకటించుకున్న వారణాసి గోవింద్ గడచిన కొద్ది నెలల నుంచి ఆదృశ్యం కావడంతో సంఘం నిర్వీర్యమైంది. అయితే టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడిచినప్పటికీ ఇంకా సంఘ ఎన్నికలు జరగకపోవడంపై ఒక వర్గం గురువారం రాత్రి సంఘ భవనానికి తాళాలు వేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు నెలకున్నాయి. ఈ క్రమంలో గతంలో సంఘ అధ్యక్షునిగా ఉన్న లాడి శ్రీనివాసరావు తనకు చెందిన మద్దతు దారులతో అధ్యక్షునిగా ప్రకటించుకోవడంపై కొంతమంది వైశ్యులు అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. వందలాది కుటుంబాల మధ్య నిర్వహించాల్సిన సంఘ ఎన్నికలు కొంతమంది వ్యక్తుల మధ్య నిర్వహించి అధ్యక్షునిగా ప్రకటన చేయడం చెల్లదని కొంతమంది వ్యతిరేకించారు. అదే విధంగా సంఘానికి చెందిక ఆర్థిక పరమైన లెక్కలు వ్యక్తుల మధ్యనే ఉన్నాయని వాటిని బ్యాంకులో జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కొంతమంది వైశ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఏదిఏమైనా టెక్కలి పట్టణంలో వైశ్యుల మధ్య అంతర్గత పోరు మరలా ఆరంభమైంది.


గేటు ముందు నిరసన వ్యక్తం చేస్తున్న వైశ్యులు

చెన్నైలో వలస మత్స్యకారుడు మృతి


మృతి చెందిన శ్యామసుందరరావు

సోంపేట: చెన్నైలో శుక్రవారం జరిగిన పడవ ప్రమాదంలో సోంపేట మండలం ఇసుకల పాలెం గ్రామానికి చెందిన సిరపు శ్యామ సుంద రరావు (38) మృతి చెందాడు. ఈ మేరకు తోటి మత్స్యకారుల నుంచి కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చింది. చేపల వేటకోసం మత్స్యకారులంతా బోటులో సముద్రంలోకి వెళ్తుండగా ఉధృతంగా అలలు రావడంతో అలల తాకిడికి బోటు నుంచి జారిపడి మృతి చెందాడు. మృతుడికి భార్య భానుమతితో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్యామసుందర్ మృతితో ఇసకల పాలెంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.

యువకుడు ఆత్మహత్య

నందిగాం: మండలం ఆనందపురం పంచాయతీ పరిధిలో గల చెరువు గట్టు వద్ద వజ్రపు కొత్తూరు మండలం అనంతగిరి గ్రామానికి చెందిన ఇచ్ఛాపురం హరికృష్ణ పురుగుమందు తాగి అపస్మారక స్థితికి చేరుకోవడంతో స్థానికులు గుర్తించి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడు తల్లి ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ప్రిన్సిపాల్ మృతి


ఉదయలక్ష్మి (ఫైల్)

పొందూరు: పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ ఉదయలక్ష్మి (52) గుండె పోటుతో శుక్రవారం స్వగ్రామం ఏలూరులో మృతి చెందారు. స్వగృహంలో ఒక్క సారిగా గుండెపోటుకు గురి కావడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. నాలుగురోజుల క్రితం స్థానిక కళాశాలలో ఒక్కసారిగా అస్వస్థతకు గురికావడంతో కళాశాల సిబ్బంది పొందూరు సామాజిక ఆస్పత్రికి తరలించి చికిత్సను అందించారు. స్వగ్రామంలో బంధువుల వివాహం ఉండడంతో సెలవుపెట్టి వెళ్లారని, ఇంతలోనే గుండె పోటుతో మృతి చెందడం బాధాకరమైన విషయమంటూ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది కన్నీటిపర్యంతం అయ్యారు. సీనియర్ అధ్యాపకురాలిగా జోన్-2లో పనిచేసిన ఆమె పదోన్నతిపై పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉద్యోగంలో చేరారు. కళాశాల అభివృద్ధికి తనవంతుగా ఆమె కృషి చేశారు. ఈమె మృతిపై ఎమ్మెల్యే కూన రవికుమార్, ఎంఇఒలు శ్రీరాములు, రాజారావు, మండల టిడిపి అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది సంతాపాన్ని తెలిపారు.

సర్పంచ్ మృతి


సత్యరాజులు (ఫైల్)

వజ్రపుకొత్తూరు: మండలంలోని మంచినీళ్లపేట సర్పంచ్ వంక సత్యరాజులు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి వైసిపి నాయకులు సంతాపం తెలిపారు. ఆయన ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. గత పదేళ్లుగా వైసిపి బలోపేతానికి కృషి చేయడంతో పాటు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు ప్రధాన అనుచరుడుగా ఉన్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న ఆయన మృతి పార్టీకి తీరనిలోటన్నారు. పరామర్శించిన వారిలో వైసిపి మండల అధ్యక్షుడు తిర్రి రాజా రావు, మాజీ అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్య నాయుడు, వైస్ఎంపిపి వంకరాజు, నాయకులు ఉన్నారు.

వికలాంగురాలికి గాయాలు


మాట్లాడుతున్న వికలాంగురాలు

టెక్కలి రూరల్: టెక్కలి మండలం బన్నువాడ పంచాయతీకి చెందిన వికలాంగురాలు శుక్రవారం ఆస్పత్రికి వెళ్లేం దుకు రోడ్డుపై వేచి ఉండగా గుర్తుతెలియని వ్యక్తి వచ్చి లిఫ్ట్ ఇచ్చాడు. ఈ క్రమంలో తాను టెక్కలిలో డ్రాప్ చేస్తానని చెప్పి గూడెం వైపు రహస్య ప్రాంతానికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించగా వికలాంగురాలు బైక్‌పై నుంచి దూకే యడంతో తీవ్రంగా గాయపడింది. క్షతగాత్రురాలు 108 సహాయంతో టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ ఘటనపై బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


అవగాహన కల్పిస్తున్న సిఐ దుర్గాప్రసాద్

నాటుసారా నిర్మూలిద్దాం

ఇచ్ఛాపురం: మండలంలో ఈదుపురం, సన్యాసి పుట్టుక, అగ్రహారం తదితర గ్రామాల్లో ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నాటుసారాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో నాటుసారా అమ్మకాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరి ంచారు. నాటుసారా వల్ల కలిగే దుష్ఫలితాలను వివ రించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా మద్యం బెల్ట్ షాపులు, నాటుసారా విక్రయించిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

పొన్నాడలో ఉచిత వైద్య శిబిరం

శ్రీకాకుళం అర్బన్: ఎచ్చెర్ల మండలం పొన్నాడలో మహాదన్ అగ్రిటెక్ లిమిటెడ్ ఆర్థిక సాయంతో బ్రెడ్స్ స్వచ్ఛంద సంస్థ, జెమ్స్ ఆస్పత్రి సంయుక్తంగా శుక్రవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 500 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. గుండె, నేత్ర, ఎముకుల సంబంధిత వ్యాధులను పరీక్షించారు. అలాగే మహిళల్లో గైనిక్ సమస్యలు, జ్వరాలు, సుగర్, బిపి వంటి పరీక్షలు నిర్వహించారు. పొన్నాడ సర్పంచ్ ప్రతినిధి నేతింటి నీలప్పడు, గ్రామపెద్దలు పంచిరెడ్డి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ వెంకట రమణ, స్పందన కృష్ణమూర్తి మహాదాద్ హెచ్ఆర్ ఎన్ని రాజేశ్వరరావు, సేఫ్టీ అధికారి రమణబాబు, బ్రెడ్స్ ప్రోగ్రాం మేనేజర్ ఎం.సింహాచలం, సూర్యకుమారి, చిరంజీవి, తేజేశ్వరి, జెమ్స్ వైద్యులు పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

డోలోత్సవం... జన సందోహం



కవిటి : జాతరలో యాత్రికులు

ప్రజాశక్తి- కవిటి

మండలం బెజ్జిపుట్టుగలో రెండు వారాలుగా జరిగిన శ్రీ చక్ర పెరుమాళ్ స్వామి డోలోత్సవం - తృతీయ బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా ముగిశాయి. విశాఖపట్నం డిఐజి బాబ్జీ, శ్రీకాకుళం డిఎఫ్ఒ సంజయ్ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో భాగంగా శ్రీ వేంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ వారు ప్రదర్శించిన కూచిపూడి భరత నాట్యం అబ్బురపరిస్తే మడమల రాంబాబు భాగవతార్ (రేడియో టివి ఆర్టిస్ట్) చేసిన హరికథ గానం ఆహుతులను అలరించింది. అనంతరం జరిగిన జాతర జన సందోహంగా మారింది. కవిటి మండలంలోని గ్రామాలతో పాటు ఒడిశా నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులతో బొమ్మల షాపులు కిటకిటలాడాయి. అనంతరం వేకువ జామున జరిగిన కామదహనం కార్యక్రమంతో డోలోత్సవాల కార్యక్రమం పరిసమాప్తమైంది.



పోలాకి : యాత్రికులకు ప్రసాద వితరణ

ఘనంగా డోల పౌర్ణమి మహోత్సవాలు

పోలాకి: మండలంలో పిర్యాగ్రహరంలో డోల పౌర్ణమి మహోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డోలో పౌర్ణమి మహోత్సవ కార్యక్రమంలో భాగంగా స్వామివారికి నైవేథ్యంగా పానీయం, (మజ్జిగ) ఏర్పాటు చేసిన ప్రియాగ్రహారం ఎంపిటిసి సుంకరి ప్రసాదరావు ప్రసాదం ఏర్పాటు చేసిన నెయ్యల సూర్యనారాయణ వారి కుమారులు మాధవరావు, వినోద్ కుమార్, కుంచాడ సంతోష్ కుమార్ సమర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, గ్రామపెద్దలు, యువజన సంఘం నాయకులు, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో మాఘపౌర్ణమి సందర్భాన్ని పురష్కరించుకుని డోలోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యాన ఉషా, పద్మిని, ఛాయా సమేత సూర్యనారాయణ స్వామి ఉత్సవమూర్తుల తిరువీధి మహోత్సవం నిర్వహించారు. అనంతరం చిన్నతోటలో స్వామి వారికి విశేష సేవలు నిర్వహించారు. సాయంత్రం డోలోత్సవం సందర్భంగా మఖా కాల్చారు.



శ్రీకాకుళం అర్బన్ : తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు



కవిటి : ఆకట్టుకున్న కూచిపూడి నాట్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న వసంతరావు

సంకల్పంతో విజయాలు సాధ్యం

ప్రజాశక్తి- పొందూరు

సంకల్ప బలంతో జీవితంలో ఎంతటి విజయాలనైనా సాధించవచ్చునని ఆప్తాలమిక్ ఆఫీసర్, సామాజిక కార్యకర్త రోటరీయన్ సప్పటి వసంతరావు అన్నారు. మండలంలోని లోలుగు కెజిబివి పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభావతి జాగృతి ట్రస్టు వారు ప్రేరణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాజిటివ్ దృక్పథంతో ముందుకు వెళ్లాలని తెలిపారు. పదోతరగతి పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వింతగా పుట్టిన గొర్రె పిల్ల

వింత గొర్రెపిల్ల జననం

కోటబొమ్మాళి: సంతబొమ్మాళి మండలం ఉదయపురం గ్రామం కూస భీమారావుకు చెందిన గొర్రె ప్రసవ వేదనతో ఇబ్బంది పడుతుండడంలో శుక్రవారం కురుడు పశు వైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్‌ను సంప్రదించి ఉదయం కోటబొమ్మాళిలో వారి ఇంటి వద్దకే తీసుకురావడంతో ఆయన గొర్రెను పరిశీలించగా దూడ పెద్దగా ఉందని గ్రహించి, రైతు అంగీకారం మేరకు శస్త్ర చికిత్స చేశారు. సుమారు 6 కిలోల పైన బరువున్న, బతికున్న రెండు మగ దూడలు కలిసి ఒక దూడగా ఒకే తలతో పుట్టింది. ఇలా వింత దూడలు పుట్టడాన్ని ఫీటల్ మానస్టర్ అంటారన్నారు. జన్యుపరమైన లోపాలు వలన పిండం ఏర్పడే క్రమంలో క్రోమోజోములు, జన్యువులు మ్యుటేషన్ చెంది, డూప్లికేషన్ ప్రోసెస్ ద్వారా ఇలా ఫీటల్ మోనస్టర్స్ ఏర్పడతాయని ఆయన తెలిపారు.

కిడ్నీ బాధితురాలికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- కవిటి

కవిటి మండలం బల్లిపుట్టుగ గ్రామానికి చెందిన సావిత్రి దలై అనే కిడ్నీ బాధితురాలికి మానిక్యేశ్వరి హెల్పింగ్ హేండ్స్ అండగా నిలిచింది. సామాజిక మాధ్యమాల ద్వారా విషయం తెలుసుకున్న సంస్థ సభ్యులు తక్షణ సహాయంగా శుక్రవారం రాత్రి రూ.10, 500 లు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు



పొగమంచులో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

దట్టంగా పొగమంచు

పొందూరు: దట్టంగా పొగమంచు కురుస్తూ కనిపిస్తున్న ఈ దృశ్యం పొందూరు మండలంలోని రాపాక కూడలి-కింతలి రహదారిలోనిది. వేసవి ప్రారంభం కావడంతో ఒకపక్క ఎండల తీవ్రత పెరుగుతుండగా మరోపక్క వేకువజామున దట్టమైన పొగమంచు కురుస్తుంది. దీంతో వేకువ జామున ఎదురెదురుగా వచ్చిన వాహనాలు కనిపించకపోవడంతో వాహన దారులు లైట్లు వేసుకుంటూ రాకపోకలు సాగించారు. సుమారు 7.30 గంటల వరకూ పొగమంచు కురవడంతో ప్రజలు అవస్థలు పడ్డారు.



తూటికాడ కషాయం పిచికారీ చేస్తున్న అధికారులు

కషాయం పిచికారీ

రణస్థలం: మండలంలోని బండిపాలెంలో రైతు అల్లు యుగంధర్‌కు చెందిన ఐదెకరాల కొబ్బరి తోటకు తెల్ల దోమ నివారణ నిమిత్తం తూటికాడ కషాయం తయారు చేసి జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి పి.రేవతి సమక్షంలో పిచికారి చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎకరా కొబ్బరితోటకు పదిలీటర్ల నీరు, ఐదుకిలోల తూటికాడను నీటిలో నాలుగు లేదా ఐదు పొంగులు వచ్చేంత వరకు మరగబెట్టి ఆ ద్రావణంలో ఆవు మూత్రం కలిపి పిచికారి చేయించినట్లయితే తెల్లదోమను సమర్థవంతంగా నివారించవచ్చునని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ, మండల వ్యవసాయ విస్తరణాధికారి సునీత, ప్రగతి వ్యవసాయ సిబ్బంది గంట్యాడ రాంబాబు, కొయ్యాన రాంబాబు, రాజేశ్వరి, ప్రకృతి వ్యవసాయ గ్రామ కార్యకర్తలు కె.లక్ష్మి, రమణమ్మ, సురేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యంతోనే మానవ మనుగడ

ప్రజాశక్తి- పలాస



వెంకటాచలం

భారత ప్రభుత్వం ఈ ఏడాది స్థిరమైన జీవనశైలికి సరైన పరివర్తన 'అనే ఇతివృత్తంతో ప్రచారం వినియోగదారులను చైతన్య పరిచే కార్యక్రమాలతో పనిచేస్తుందని జిల్లా వినియోగదారుల క్లబ్‌ల మాస్టర్ ట్రైనర్ ఎల్.వెంకటాచలం అన్నారు. గత దశాబ్దం రికార్డు స్థాయిలో అత్యంత వేడిగా ఉందన్నారు. తీవ్రమైన వాతావరణం అనేక దేశాల్లో నిత్యకృత్యంగా మారిందని, జీవితాలను, జీవనోపాధిని దెబ్బతీస్తోందన్నారు. అదే సమయంలో జీవవైవిధ్య నష్టం, కాలుష్యం మానవ ఆరోగ్యానికి పెరుగుతున్న ముప్పును కలిగిస్తున్నాయన్నారు. మనం తినే విధానం, మనం ప్రయాణించే విధానం, కొనుగోలు చేసే, ఉపయోగించే ఉత్పత్తులు, సేవల్లో ప్రాథమిక మార్పులు చేయాల్సి ఉంటుందన్నారు. మార్చి 15న జరిగే ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం 2025 సందర్భంగా, కన్స్యూమర్స్ ఇంటర్నేషనల్, సభ్యుల భాగస్వాములతో కలిసి, స్థిరమైన జీవనశైలికి న్యాయమైన పరివర్తన కోసం ప్రపంచ వ్యాప్త పిలుపులో ఐక్యమవుదామని, పర్యావరణ కాలుష్యం (గాలి, రసాయన, ప్లాస్టిక్ కాలుష్యంతో సహా) ఇప్పటికే ప్రతి ఏడాది కనీసం 9 మిలియన్ల అకాల మరణాలకు కారణమవుతుందన్నారు. స్థిరమైన జీవనశైలిని అందించడానికి, గ్రహ సరిహద్దులను దాటకుండా ప్రజల హక్కులు, అవసరాలను తీర్చడానికి ఇప్పుడే చర్యలు తీసుకోవడం అవసరమన్నారు. స్థిరమైన జీవనశైలికి న్యాయమైన పరివర్తన కోసం కృషి చేయాలని, ఆహారం, నీరు, శక్తి, చలనశీలత, వినియోగ వస్తువులు, గృహనిర్మాణం, ఆర్థికం, విశ్రాంతి వంటి ప్రధాన రంగాలలో స్థిరమైన జీవనశైలిపై దృష్టి పెట్టాలన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి

పాతపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సామూహిక గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పశుపోషకులు అందరూ వినియోగించు కోవాలని పాతపట్నం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు కోరారు. మండలంలో రౌతు లక్ష్మీపురంలో జరుగుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని, తద్వారా ప్రమాదమైన, పాడి రైతుకు ఎన్నో ఆర్థిక ఇబ్బందులు కలిగిస్తున్న ఈ వ్యాధి నుంచి నివారణ పొందవచ్చని చెప్పారు. అంతకు ముందు రౌతు లక్ష్మీపురం రైతుసేవా కేంద్రాన్ని ఆయన సందర్శించి, పశువైద్య సహాయకుడు శ్యాంసుందర్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి అంపోలు మధుబాబు, గ్రామపెద్దలు యారబాటి సన్యాసిరావు, పశు వైద్య సిబ్బంది గుణాలమ్మ, వల్లభరావు, మోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న కరుణాకరరావు తదితరులు



పరీక్షా సామగ్రితో విద్యార్థులు

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

పొందూరు: మండలంలోని లోలుగు ఉపహార్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శుక్రవారం పదోతరగతి విద్యార్ధులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. మొత్తం 43 మంది విద్యార్థులకు అట్టలు, స్కేళ్లు, పెన్నులను అందజేశారు. కార్యక్రమంలో ఉపహార్ ఏరియా మేనేజర్ బి.ఎం.పాల్, కో-ఆర్డినేటర్ ఏసుదాస్, కమ్యూనిటీ ఫెసిలిటేటర్ లోపింటి అప్పారావు, సిబ్బంది మోహన్, ఉగాది, శ్రీను తదితరులు పాల్గొన్నారు.